

నిర్మల్ చైన్‌గేట్ : ప్రశంసా పత్రాలు అందిస్తున్న జిల్లా వైద్యాధికారి ధన్‌రాజ్

# ఎయిడ్స్ నిర్మూలనకు కృషిచేయాలి

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్ 1 : ఎయిడ్స్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ధన్‌రాజ్ సూచించారు. నిర్మల్ పట్టణంలోని టీఎన్జీవో భవన్‌లో ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. ఎయిడ్స్ నివారణ సేవలు జిల్లాలో విస్తృతంగా అందిస్తున్నట్లు తెలిపారు. హెచ్‌ఐవీ బాధితులకు జిల్లా కేంద్రం, ఖానాపూర్, భైంసా ఆసుపత్రుల్లో మందులు అందుబాటులో ఉన్నాయని, దీంతో వారి జీవన ప్రమాణాలు పెంచడం జరుగుతుందన్నారు. హెచ్‌ఐవీ బాధితులను ఆదరించాలని, వివక్షత చూపవద్దని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విశిష్ట సేవలందించిన వైద్య సిబ్బందికి, వ్యాస రచన, ఉపన్యాస పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమ నిర్వహణ అధికారి రవీందర్‌రెడ్డి, సుమలత, ప్రదీప్, గ్రామీణ సపోర్ట్ ఫౌండేషన్ మేనేజర్ శ్రీనివాస్, మాస్ మీడియా అధికారి రవీందర్, డీపీఎంవో రాజేశ్వర్, సూర్ ఎన్జీవో మేనేజర్ మల్లికార్జున్, ఐసీటీసీ కౌన్సిలర్లు, లింక్ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థుల ర్యాలీ..

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 1 : ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా నిర్మల్ పట్టణంలోని స్థానిక సిద్ధార్థ వొకేషన్ జూనియర్ కళాశాల విద్యార్థులు శుక్రవారం ప్లకార్డులతో ర్యాలీ తీశారు. ఎయిడ్స్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అంతకు ముందు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు రాజు, సురేశ్, భవాని, కీర్తన, కిషన్ తదితరులు పాల్గొన్నారు.



నిర్మల్ అర్బన్ : ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

# నిత్యాన్నదానం ప్రారంభం

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 1 : నిర్మల్ పట్టణంలోని హరిహర క్షేత్రం అయ్యప్ప ఆలయంలో మకర సంక్రాంతి వరకు చేపట్టనున్న నిత్యాన్నదానాన్ని శుక్రవారం ఆలయ ధర్మకర్తలు అల్లోల వినోద-మురళీధర్ రెడ్డి ప్రారంభించారు. నిత్యం మధ్యాహ్నం 12 గంటలకు హారతి అనంతరం నిత్యాన్నదానం ఉంటుందని తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఆలయ కోశాధికారి వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు.

# ఊపందుకున్న యాసంగి సాగు

- శనగ సాగుకు రైతు సిద్ధం
- ఆశాజనకంగా ఇతర పంటలు

తాంసి, డిసెంబర్ 1: ఈ ఏడాది సమృద్ధిగా కురిసిన వర్షాలతో పుష్కలంగా నీరు ఉండడంతో యాసంగి పనుల్లో రైతులు బిజీ అయ్యారు. అధిక శాతం మంది రైతులు శనగ పంట వేస్తున్నారు. ప్రధానంగా మండలాల్లో జొన్న, వేరుశనగ, శనగ, కంది, పత్తి పంటలు సాగు చేస్తున్నారు. ప్రభుత్వం సాగునీటి వసతి కల్పించడంతో పల్లెల్లో పచ్చని పొలాలు దర్శనమిస్తున్నాయి.

### పెరిగిన సాగు విస్తీర్ణం

తాంసి మండలంలో సాగునీటి వసతి ఉన్న ప్రాంతాల్లో యాసంగి సాగు పనులు ఊపందుకున్నాయి. గతంలో పోలిస్తే తాంసి, భీంపూర్, తలమడుగు మండలాల్లో పంట సాగు విస్తీర్ణం పెరిగింది. తాంసి మండలంలో మత్తడివాగు ప్రాజెక్టు ఎడమ కాలువ నుంచి వారబంది పద్ధతిలో కాకుండా నిరంతరం సాగునీరు అందించడంతో 8500 ఎకరాల్లో పంటలు సాగు అవుతున్నాయి. అలాగే కుంటలను నింపడం ద్వారా భూగర్భజలాలు పెరగడంతో చెరువుల పరిధిలోని బావులు నిండుగా మారి రైతులకు నీటి ఎద్దడి లేకుండా పోయింది. బావులు, బోర్ల ద్వారా వందల ఎకరాలకు నీరందుతున్నది. తాంసి మండలంలో 10 కిలో మీటర్ల ఎడమ కాలువలు లింక్, డిస్ట్రిబ్యూటరీ కెనాళ్లు ఉండగా బండల్‌నాగపూర్ నుంచి వచ్చే కాలువ ద్వారా వడ్డాడి నుంచి ప్రారంభమై జామిడి, కప్పర్ల, ఆదిలాబాద్ రూరల్ మండలంలోని పొచ్చర, జందాపూర్, దిమ్మ, గ్రామాల్లో సాగునీరు అందనుంది. భీంపూర్, తాంసి, తలమడుగు మండలంలో వేల ఎకరాల్లో శనగ పంట సాగు చేస్తున్నారు.



తలమడుగులో సాగు చేస్తున్న శనగ పంట

### వేల ఎకరాల్లో పంటలు సాగు..

మండలాల్లో ఈ సారి సాగవుతున్న యాసంగి పంటల వివరాలను వ్యవసాయ అధికారులు సేకరిస్తున్నారు. అధికారుల లెక్కల ప్రకారం ఇప్పటి వరకు 98,300 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేపట్టగా యాసంగికి మరో సుమారు వెయ్యి ఎకరాల వరకు ఉంటుందని అంచనా వేశారు. తాంసి మండలంలో శనగ పంట 100 ఎకరాలు, భీంపూర్ మండలంలో 300, తలమడుగు మండలంలో 600 ఎకరాల్లో సాగు చేస్తున్నారు.

### శనగ పంట పండిస్తున్నా..



గతంలో మాదిరిగా రైతులకు సాగునీటి సమస్య లేకుండా పోయింది. ప్రస్తుతం యాసంగి రెండో పంటగా శనగ సాగు చేస్తున్నాను. మిషన్ కాకతీయతో చెరువులు నిండు కుండలా మారడంతో పంటలు పండిస్తున్నాం.

**- కుంటల వెంకట్ రెడ్డి, రైతు, బండల్‌నాగపూర్**

### ఆశాజనకంగా పంటల సాగు..



తాంసి, భీంపూర్ మండలాల్లో సాగు చేస్తున్న యాసంగి పంటలు ప్రస్తుతం ఆశాజనకంగా ఉన్నాయి. త్వరలోనే శనగ పంట పనులు ప్రారంభం కానున్నాయి. రైతులు శనగ విత్తుకొని నీరు అందిస్తున్నారు. గత సంవత్సరంతో పోల్చితే ఈసారి సాగు విస్తీర్ణంలో మార్పులేదు. ఉమ్మడి మండలంలో పంటల సాగు విస్తీర్ణం పెరిగింది. **- రవీందర్, మండల వ్యవసాయాధికారి, తాంసి**

# మండల సర్వసభ్య సమావేశం వాయిదా

ఉట్నూర్, డిసెంబర్ 1: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం వాయిదా వేసినట్లు ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్ తెలిపారు. అధికారులు అసెంబ్లీ ఎన్నికల విధులు నిర్వహించి ప్రత్యేక సెలవులలో ఉన్నందున సమావేశాన్ని మరోసారి నిర్ణయించి ప్రకటిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బాలాజీ, ఎంపీడీవో తిరుమల, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్

# 10న నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 1 : 2023-24 సంవత్సరానికి జరుగనున్న నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్ పరీక్ష కోసం ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్న ఆదిలాబాద్ జిల్లా విద్యార్థులకు ఈ నెల 10వ తేదీ ఆదివారం ఉదయం 9.30 నుంచి 12.30 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు డీఈవో ప్రణీత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు సంబంధించిన హాల్ టికెట్లు ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయ వెబ్‌సైట్ https://bse.telangana.gov.in నుంచి పొందవచ్చని పేర్కొన్నారు.

# ‘ఓటుకు’ పోటెత్తారు..

- బోథ్ నియోజకవర్గంలో 82.86% పోలింగ్
- బాబ్జీపేట్‌లో 100 శాతం



బోథ్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఓటు వేసేందుకు వరుసలో నిల్చున్న మహిళలు

బోథ్, డిసెంబర్ 1: బోథ్ నియోజకవర్గ పరిధిలో గురువారం నిర్వహించిన శాసనసభ ఎన్నికల పోలింగ్ 82.86 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి చాహత్‌బాజ్‌పాయ్ శుక్రవారం అధికారికంగా వెల్లడించారు. తొమ్మిది మండలాల పరిధిలోని 302 పోలింగ్ కేంద్రాలకు గాను 2,08,048 మంది ఓటర్లకు గాను 1,72,397 మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్లు పేర్కొన్నారు. వీరిలో 85,028 మంది పురుషులు, 87,369 మంది మహిళలు ఉన్నట్లు పేర్కొన్నారు.

### బాబ్జీపేట్‌లో 100 శాతం..

ఇచ్చోడ మండలం బాబ్జీపేట్ 177 పోలింగ్ కేంద్రంలో వంద శాతం పోలింగ్ నమోదైంది. ఇక్కడ 370 మంది ఓటర్లకు గాను 170 మంది పురుషులు, 200 మంది మహిళలు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

### బోథ్‌లో 73 శాతం..

బోథ్, డిసెంబర్ 1: బోథ్ నియోజకవర్గ కేంద్రంలో 73 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఇక్కడ 8461 మంది ఓటర్లకు గాను పది పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 4049 మంది పురుషులకు గాను 2974 మంది, 4412 మంది మహిళలకు గాను 3219 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 249 పోలింగ్ కేంద్రంలో 827కు గాను 585, 250లో 635కు గాను 478, 251లో 849కు గాను 595, 252లో 705కు గాను 555, 253లో 937కు గాను 683, 254లో 848కు గాను 600, 255లో 975కు గాను 688, 257లో 1143కు గాను 803, 258లో 687కు గాను 514, 259లో 855కు గాను 689 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

### మండలాల వారీగా..

బోథ్, డిసెంబర్ 1: బోథ్ నియోజకవర్గం పరిధిలోని తొమ్మిది మండలాల వారీగా పోలింగ్ వివరాలు ఇలా ఉన్నాయి. భీంపూర్ మండలంలో 28 పోలింగ్ కేంద్రాలకు గాను 18,932 మంది ఓటర్లకు గాను 15,622 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. తాంసి మండలంలో 17 పోలింగ్ కేంద్రాలకు గాను 13,525 మంది ఓటర్లకు గాను 11,566, తలమడుగు మండలంలో 43 పోలింగ్ కేంద్రాలకు గాను 27,003 మంది ఓటర్లకు గాను 23,813, గుడిహత్నూర్‌లో 36 పోలింగ్ కేంద్రాలకు గాను 24,379 మంది ఓటర్లకు గాను 20,144, ఇచ్చోడలో 48 పోలింగ్ కేంద్రాలకు గాను 33,989 మంది ఓటర్లకు గాను 27,789, సిరికొండలో 9 పోలింగ్ కేంద్రాలకు గాను 6,925 మంది ఓటర్లకు గాను 6,020, బజార్‌హత్నూర్‌లో 37 పోలింగ్ కేంద్రాలకు గాను 23,178 మంది ఓటర్లకు గాను 18,351, బోథ్‌లో 49 పోలింగ్ కేంద్రాలకు గాను 37015 మంది ఓటర్లకు గాను 29,717, నేరడిగొండ మండలంలో 35 పోలింగ్ కేంద్రాలకు గాను 23,102 మంది ఓటర్లకు గాను 19,366 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. నియోజకవర్గం పరిధిలోని తొమ్మిది మండలాల్లో 302 పోలింగ్ కేంద్రాల్లో 2,08,048 ఓటర్లకు గాను 1,72,397 మంది ఓట్లు వేశారు.